నమస్తే తెలంగాణ
వరంగల్
5 | వరంగల్, శనివారం 28 సెప్టెంబర్ 2024 | WARANGAL

రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు తమది ప్రజా ప్రభుత్వమని పదేపదే చెప్పుకుంటున్నారు. క్షేత్రస్థాయిలో మాత్రం అందుకు విరుద్ధంగా నడుస్తున్నది. బెదిరింపులు.. సెటిల్‌మెంట్లు చేస్తూ కాంగ్రెస్ ప్రజా ప్రతినిధుల అనుచరులు రౌడీ పాలన కొనసాగిస్తున్నారు. ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణగా వరంగల్ తూర్పు నియోజకవర్గం నిలుస్తుంది. ఇక్కడ ప్రభుత్వంలో కీలక పదవిలో ఉన్న ప్రజాప్రతినిధి అనుచరుడి దందాలు రౌడీ రాజ్యాన్ని తలపిస్తున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆ మాజీ రౌడీ షీటర్ ఓ మంత్రికి ప్రధాన అనుచరుడిగా మారడం.. ఎలాంటి పదవి లేకున్నా అంతా తానే అనేలా వ్యవహరిస్తూ సామాన్యులపై జులుం ప్రదర్శించడం తూర్పు నియోజకవర్గంలో ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది.

- సుబేదారి, సెప్టెంబర్ 27

తూర్పులో రౌడీ రాజ్యం

రెచ్చిపోతున్న మంత్రి అనుచరుడు

- బెదిరింపులు.. సెటిల్‌మెంట్లు
- ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్న దందాలు
- చర్చనీయాంశమైన 'నమస్తే' కథనం
- రంగంలోకి నిఘా వర్గాలు



మంత్రి అనుచరుడు, మాజీ రౌడీషీటర్ దందాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. మంత్రి అండతో రెచ్చిపోతూ పోలీసు అధికారులు, కొంతమంది రౌడీలను కోటరీగా పెట్టుకొని ప్రతిరోజూ ఉదయం వరంగల్ నగరంలోని అతడి ఇంటి వద్ద, సాయంత్రం నగర శివారులోని గెస్ట్‌హౌస్‌లో సెటిల్‌మెంట్లు చేస్తున్నట్లు తెలుస్తున్నది. వివాదాస్పద భూములు, అప్పుల పంచాయితీలను టార్గెట్‌గా చేసుకొని తూర్పు నియోజకవర్గంలోని డివిజన్లవారీగా తన అనుచరులు, పోలీసులను ముందుపెట్టి రూ. కోట్లల్లో సెటిల్‌మెంట్లు చేస్తున్నట్లు తెలిసింది.

బెదిరించి రిజిస్ట్రేషన్లు..

వివాదాస్పద భూముల్లో మంత్రి అనుచరుడు తలదూర్చి తమదైన స్టైల్లో బెదిరించడం, వినని వారిపై కేసులు పెట్టించి బినామీ పేర్లతో రిజిస్ట్రేషన్ చేయిస్తున్నట్లు తెలిసింది. ఇందులో భాగంగా స్తంభంపల్లి శివారులో రూ. 7 కోట్ల విలువ చేసే మూడెకరాల సాగు భూమి విషయమై ఇద్దరి మధ్య కొనసాగుతున్న వివాదాన్ని ఆసరా చేసుకొని, వారిని బెదిరించి అతి తక్కువ ధరకు బినామీ పేరుతో రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు తెలిసింది. అలాగే వరంగల్ 34వ డివిజన్‌లో ఒకరిని తన అనుచరుడితో బెదిరించి రూ. 40 లక్షల భూమిని సొంతం చేసుకున్నట్లు ఆరోపణలున్నాయి. అలాగే ఇటీవల మంత్రి పుట్టిన రోజు సందర్భంగా మంత్రి అనుచరుడు ఓ వస్త్ర వ్యాపారిని బెదిరించి పెద్ద మొత్తంలో చీరలు తీసుకున్నట్లు ఆరోపణలున్నాయి. తూర్పులో అధికారిక కార్యక్రమాల పేరు చెప్పి వ్యాపారుల నుంచి పెద్ద ఎత్తున వసూళ్లకు పాల్పడుతున్నట్లు చర్చ జరుగుతున్నది.

పట్టు కోసం..

తూర్పులో పట్టుకోసం తనకంటూ ప్రత్యేకమైన కోటరీ వ్యవస్థను ఏర్పాటు చేసుకోవడానికి ఆ మాజీ రౌడీషీటర్ పక్కాగా ముందుకు వెళ్తున్నాడు. 'అన్నకు ఏజ్ బార్ అయ్యింది.. హెల్త్ ఇబ్బంది పెడుతున్నది.. బయటకు రాలేడు.. ఇప్పుడంతా నేనే.. ఇక మనదే రాజ్యం' అంటూ తన అనుచరులకు భరోసా ఇస్తూ డివిజన్ల వారీగా కొత్తతరం యువకులను తన వెంట ఉంచుకోవడానికి వారి పుట్టిన రోజున రూ. 5వేలు, మందు అందజేసి అభిమానం చాటుకుంటున్నట్లు తెలిసింది.

తూర్పులో 'నమస్తే' ప్రకంపనలు..

మంత్రి అనుచరుడితో పోలీసు అధికారులు అంటకాగుతూ సామాన్యులపై జులుం ప్రదర్శిస్తున్న ఘటనలు, బెదిరింపులపై 'నమస్తే తెలంగాణ'లో శుక్రవారం ప్రమురితమైన 'రౌడీకి పోలీసు సలాం' కథనం తూర్పు నియోజవర్గం ప్రజల్లో చర్చనీయాంశమైంది. అధికార పార్టీ, పోలీసు వర్గాల్లో ప్రకంపనలు సృష్టించింది. నేర స్వభావం ఉన్న వ్యక్తికి మంత్రి ప్రాధాన్యత ఇవ్వడం ఏమిటని అధికార పార్టీ నేతలు చర్చించుకోవడం కనిపించింది. ఇదిలా ఉండగా, సదరు మాజీ రౌడీషీటర్ వరంగల్ పోచమ్మమైదాన్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో 23వ డివిజన్ అధికార పార్టీకి చెందిన ఓ నేతను ఉద్దేశించి తీవ్రస్థాయిలో విరుచుకుపడినట్లు తెలిసింది. 'నాపై ఓ నాయకుడు కావాలని పేపర్‌కు లీకులిచ్చి వార్త వచ్చేటట్టు చేశాడు.. ఇది అన్న (బాస్) చూసి సీరియస్‌గా ఉన్నాడు.. మీరు నాతోనే ఉంటే బెటర్.. లేకుంటే మీకు భవిష్యత్ ఉండదు' అని వార్నింగ్ ఇచ్చినట్లు విశ్వనీయ సమాచారం.

నిఘా వర్గాల ఆరా..

మంత్రి అనుచరుడిపై 'నమస్తే తెలంగాణ'లో వచ్చిన ప్రత్యేక కథనంపై వరంగల్ పోలీసు కమిషనరేట్ నిఘా వర్గాలు ఆరా తీశాయి. అతడి దినచర్య, సహకరిస్తున్న పోలీసు అధికారులు, బెదిరింపులు, సెటిల్‌మెంట్లపై ఇంటెలిజెన్స్, ఎస్బీ అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు. మంత్రి అండతో ఇటీవల సదరు అనుచరుడు చేసిన వ్యవహారాలపై ఆధారాలతో ఒకటి రెండు రోజుల్లో నిఘా వర్గాలు రాష్ట్ర పోలీసు ఉన్నతాధికారులు, ప్రభుత్వ పెద్దలకు రిపోర్టు ఇవ్వనున్నట్లు తెలిసింది.

వరంగల్ కలెక్టర్‌కు అవార్డు

అవార్డు తీసుకుంటున్న కలెక్టర్ సత్య శారద

ఖిలావరంగల్, సెప్టెంబర్ 27: యువ టూరిజం క్లబ్‌ల ఏర్పాటులో వరంగల్ జిల్లాను రాష్ట్రంలోనే 2వ స్థానంలో నిలిపినందుకు కలెక్టర్ సత్య శారదకు అవార్డు దక్కింది. శుక్రవారం హైదరాబాద్ గచ్చిబౌలిలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు చేతులమీదుగా ఆమె అవార్డు అందుకున్నారు. తనకు అవార్డు రావడంపై కలెక్టర్ హర్షం వ్యక్తం చేశారు. జిల్లాలోని యువ టూరిజం క్లబ్‌ల నమోదుపై ప్రత్యేక శ్రద్ధ పెట్టడం వల్ల ద్వితీయ స్థానం సాధించామన్నారు. నిరాదరణకు గురైన 14 ఆలయాలను గుర్తించి, వాటి పునరుద్ధరణకు ప్రణాళికులు చేయనున్నట్లు తెలిపారు. పర్యాటకం, సంస్కృతీ సంప్రదాయాలు, వారసత్వ సంపదపై విద్యార్థుల కు అవగాహన కల్పించడంతో పాటు పర్యాటక రంగానికి పెద్దపీట వేస్తామన్నారు.

మూడు మిల్లుల నుంచి సున్నా..

గత వానకాలం ధాన్యం పొందిన కొన్ని రైస్ మిల్లుల నిర్వాహకులు ఇంకా సీఎంఆర్ డెలివరీ చేయడం ప్రారంభించలేదు. ఖిలావరంగల్ మండలం బొల్లికుంటలోని సౌభాగ్య ఆగ్రో ప్రొడక్ట్స్ రైస్‌మిల్లు నిర్వాహకులు పొందిన 799 టన్నుల ధాన్యం ద్వారా 535.080 టన్నులు, నెక్కొండ మండలం చంద్రుగొండలోని శ్రీవెంకటేశ్వర మోడ్రన్ రైస్‌మిల్ నిర్వాహకులు పొందిన 899.68 టన్నుల ధాన్యానికి 602.786 టన్నులు, సంగెం మండలం కాపులకనపర్తిలోని సతీశ్ ఇండస్ట్రీస్ రైస్ మిల్ 418 టన్నులకు 280.435 టన్నుల సీఎంఆర్ డెలివరీ చేయాల్సి ఉంది. ఈ నెలాఖరుతో గడువు ముగుస్తున్నా వీరు ఒక్క టన్ను కూడా సీఎంఆర్ డెలివరీ చేయలేదు. జీరో శాతం డెలివరీ ఉన్న ఈ మిల్లర్లపై అధికారులు ఉదాసీనంగా వ్యవహరించడం అనుమానాలకు తావిస్తున్నది. విచిత్రమేమిటంటే సతీశ్ ఇండస్ట్రీస్ రైస్ మిల్లు నిర్వాహకులు 2022-23 యాసంగి ధాన్యానికి సంబంధించిన సీఎంఆర్ బకాయి ఉన్నారని నాలుగు రోజుల క్రితం టాస్క్‌ఫోర్స్ అధికారులు దాడులు జరిపారు. ఇందులో సదరు ధాన్యం లేదని గుర్తించి యజమానిపై క్రిమినల్ కేసు నమోదు చేసి మిల్లును సీజ్ చేశారు. దీంతో గత వానకాలం ధాన్యం సీఎంఆర్‌ను ఈ రైస్ మిల్లు నుంచి డెలివరీ చేసే అవకాశం లేదని తెలుస్తున్నది.

పౌర సరఫరాల శాఖలోని కొందరు అధికారుల సహకారంతో పలువురు రైస్ మిల్లర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వం నుంచి ధాన్యం పొంది కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్)ను డెలివరీ చేయడం లేదు. అయినా అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం వరంగల్ జిల్లాలో ఇదే పరిస్థితి నెలకొంది. ఏటా వానకాలం, యాసంగి ధాన్యాన్ని రైతుల నుంచి కొనుగోలు చేస్తున్న ప్రభుత్వం సీఎంఆర్ కోసం రైస్ మిల్లులకు కేటాయిస్తున్నది. మిల్లుల నిర్వాహకులు నూర్పిడి చేసి నిర్దేశిత గడువులోగా సీఎంఆర్ డెలివరీ చేయాల్సి ఉంది. గత వానకాలం ధాన్యం పొందిన రైస్ మిల్లర్లు ఈ నెలాఖరు వరకు సీఎంఆర్ డెలివరీ చేయాలని ప్రభుత్వం గడువు విధించింది. మరి కొద్దిరోజుల్లో ఈ డెడ్‌లైన్ ముగిసిపోనుండగా జిల్లాలో కొందరు మిల్లర్లు ఇప్పటి వరకు సీఎంఆర్ డెలివరీ చేయడం మొదలు పెట్టలేదు. డెలివరీ శాతం జీరో ఉన్న రైస్ మిల్లుల్లో ప్రభుత్వం కేటాయించిన గత వానకాలం ధాన్యం నిల్వలు అసలు ఉన్నాయా? లేవా? అనేది చర్చనీయాంశంగా మారింది. *- వరంగల్, సెప్టెంబర్ 27 (నమస్తే తెలంగాణ)*

గత వానకాలం ధాన్యానికి ఈ నెలాఖరు వరకు డెడ్‌లైన్

- ఇప్పటికీ గింజ కూడా డెలివరీ చేయని కొన్ని రైస్ మిల్లులు
- గడువు సమీపిస్తున్నా అతి తక్కువ డెలివరీ చేసిన పలువురు మిల్లర్లు
- ఉదాసీనంగా వ్యవహరిస్తున్న సివిల్ సప్లయిస్ అధికారులు
- క్షేత్రస్థాయి పర్యవేక్షణా లోపంపై తీవ్ర విమర్శలు

సీఎంఆర్ డెలివరీ జీరో!

వరంగల్ జిల్లాలో గత ఏడాది (2023-24) రైతుల నుంచి ప్రభుత్వం కొనుగోలు చేసిన 56,967 టన్నుల వానకాలం ధాన్యాన్ని వంద రైస్ మిల్లులకు సీఎంఆర్ కోసం కేటాయించింది. మిల్లుల నిర్వాహకులు నిబంధనల ప్రకారం ఈ ధాన్యాన్ని నూర్పిడి చేసి ప్రభుత్వానికి 38,255 టన్నుల సీఎంఆర్ డెలివరీ చేయాల్సి ఉంది. ప్రభుత్వం నిర్దేశించిన గడువు ఈ నెలాఖరు వరకు ముగుస్తున్నప్పటికీ సోమవారం వరకు టార్గెట్‌లో 75 శాతం అంటే 28,729 టన్నుల సీఎంఆర్ మాత్రమే డెలివరీ చేశారు. ఇంకా 9,491 టన్నుల సీఎంఆర్‌ను రైస్ మిల్లర్లు డెలివరీ చేయాల్సి ఉంది.

కొన్ని మిల్లుల నుంచి కొద్ది శాతమే..

గత వానకాలం ధాన్యం పొందిన రైస్‌మిల్లుల్లో చంద్రుగొండలోని మల్లికార్జునస్వామి ఇండస్ట్రీస్ రైస్ మిల్లు కేవలం 6.20 శాతం, సంగెం మండలం తీగరాజుపల్లిలోని కేఎన్ఆర్ మిల్లు టెక్ రైస్ మిల్లు 16.36 శాతం సీఎంఆర్ మాత్రమే సోమవారం వరకు డెలివరీ చేశాయి. గీసుగొండ మండలం విశ్వనాథపురంలోని మారుతి మిల్ టెక్ రైస్ ఇండస్ట్రీస్ నిర్వాహకులు 19.17, కొనాయమాకులలోని న్యూసహార ఇండస్ట్రీస్ మిల్లు వారు 15.63, కొమ్మాలలోని శ్రీవెంకటేశ్వర బీఆర్ మిల్లు 22.04 శాతం సీఎంఆర్ డెలివరీ చేసినట్లు అధికారులు వెల్లడించారు. గడువు సమీపించిన నేపథ్యంలో అధికారులు సీఎంఆర్ డెలివరీ మొదలుపెట్టని, కొద్ది శాతం డెలివరీ చేసిన రైస్ మిల్లర్లపై ఒత్తిడి తెస్తున్నట్లు తెలిసింది. ఈ క్రమంలో కొందరు రైస్ మిల్లర్లు స్పందిస్తుండగా మరికొందరు ఏ మాత్రం పట్టించుకోవడం లేదని తెలిసింది. ఈ పరిస్థితికి జిల్లాలోని పౌర సరఫరాల శాఖ, సంస్థ ఉన్నతాధికారుల పర్యవేక్షణా లోపం, క్షేత్రస్థాయి అధికారుల తీరు కారణమని సమాచారం. జీరో ఉన్న మిల్లర్లకు ఈ నెలాఖరులోగా డెలివరీ చేయాలని చెప్పినట్లు పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ సంధ్యారాణి తెలిపారు.

మిర్చి పరిశోధనా కేంద్రం ఏర్పాటు చేయాలి

లేఖను విడుదల చేస్తున్న పెద్ది సుదర్శన్‌రెడ్డి

మంత్రి తుమ్మలకు పెద్ది బహిరంగ లేఖ

నర్సంపేట, సెప్టెంబర్ 27 : వరంగల్ జిల్లా నర్సంపేట ప్రాంతంలో మిర్చి పంటను అధికంగా పండిస్తున్నందున ఇక్కడ మిర్చి పరిశోధనా కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుకు శుక్రవారం బహిరంగ లేఖ రాశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నియోజకవర్గంలోని నల్లబెల్లి మండలం కన్నారావుపేటలో హార్టికల్చర్ రీసెర్చ్ స్టేషన్, సీడ్స్ అండ్ స్పైసెస్ పరిశోధన కేంద్రాలను మంజూరు చేసి, సర్వే నం 58లో 54 ఎకరాల భూమిని సైతం కొండా లక్ష్మణ్ బాపూజీ హార్టికల్చర్ యూనివర్సిటీకి అందజేశామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై 10 నెలలు గడుస్తున్నా మిర్చి పరిశోధనా కేంద్రంపై ఎలాంటి పురోగతి లేదన్నారు. ఏటా నర్సంపేట ప్రాంతంలో మిర్చి, ఉద్యానవన పంటలకు తెగుళ్లు ఆశించి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. రూ. 80 కోట్లతో మార్కెటింగ్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ ద్వారా లక్ష టన్నుల సామర్థ్యం గల గోదాములను అందుబాటులోకి తెచ్చామని, వాటిని వినియోగంలోకి తీసుకురావాలని లేఖలో పెద్ది కోరారు.

రొటవేటర్‌లో పడి ఒకరి మృతి

- మృతదేహాన్ని యంత్రంతో ముక్కలు చేసిన రైతు
- విచారణ చేసి నిందితుడిని జైలుకు పంపిన పోలీసులు

కన్నాయిగూడెం, సెప్టెంబర్ 27: ప్రమాదవశాత్తు రొటవేటర్‌లో పడి కూలీ మృతి చెందగా, అతడి మృతదేహాన్ని ఓ రైతు యంత్రంతో ముక్కలుగా చేసి చెరువులో వేశాడు. శరీర భాగాలు దొరకడంతో విచారించిన పోలీసులు 48 గంటల్లోనే కేసును ఛేదించి సదరు రైతును శుక్రవారం జైలుకు పంపించారు. ములుగు జిల్లా కన్నాయిగూ డెం ఎస్సై వెంకటేశ్ తెలిపిన వివరాల ప్రకా రం.. మండలంలోని ఏటూరు గ్రామానికి చెందిన రమేశ్ కంతనపల్లి శివారులోని మిర్చి చేనును రోటవేటర్‌తో దున్నుతున్న క్రమంలో కూలి పనికి వచ్చిన లంజపెల్లి రవికుమార్ అందులో పడి మృతి చెందా డు. భయపడిన రైతు మృతదేహాన్ని ఆనవాళ్లు లేకుండా రోటవేటర్‌తో చిందరవందర చేసి మట్టిలో కలిపి దున్నే యత్నం చేసినా కుదరకపోవడంతో శరీర భాగాలను పక్కనే ఉన్న చెరువులో పడేశాడు. విచారణ చేపట్టిన పోలీసులు చేనులో తిరిగి అక్కడక్కడా పడి ఉన్న శరీర భాగాలను గుర్తించి రవి కుమార్ మృతికి కారణమైన రైతు పుట్ట రమేశ్‌పై కేసు నమోదు చేసి జైలుకు పంపించారు. కాగా రొటవేటర్ ట్రాక్టర్ గ్రామంలో ఉండగా సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు. 48 గంటల్లోనే కేసును ఛేదించిన ఎస్సైని బాధిత కుటుంబసభ్యులు, గ్రామస్తులు అభినందించారు.

ఆర్ట్స్ కాలేజీ ఏఆర్‌కు మెమో

- మూడు రోజుల్లో వివరణ ఇవ్వాలని ఆదేశాలు

హనుమకొండ చౌరస్తా, సెప్టెంబర్ 27: ఆర్ట్స్ కాలేజీలో అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న పెండ్లి అశోక్‌బాబుకు కేయూ రిజిస్ట్రార్ మెమో జారీ చేశారు. యూనివర్సిటీ అధ్యాపక సంఘం(అకుట్), వివిధ విద్యార్థి సంఘాలు చేసిన ఫిర్యాదుతో ఇటీవల కేయూ పరిధిలోని సర్వే నంబర్ 229లో విజిలెన్స్, రెవెన్యూ అధికారులు సర్వే పూర్తి చేసిన విషయం తెలిసిందే. ఈ సర్వే నంబర్‌లో అశోక్‌బాబు సహా కొంతమంది వ్యక్తుల నివాసాలు ఉన్నట్లు అధికారులు నిర్ధారించారు. ఈ క్రమంలో వివిధ వాట్సాప్ గ్రూపుల్లో ప్రజలను తప్పుదారి పట్టించేలా అధికారులపై ఆరోపణలు, భూ కబ్జాదారులను ప్రేరేపించడం, సరిహద్దులు, పాత కాంపౌండ్‌వాల్, డిజిటల్ సర్వేను తప్పుడుగా ప్రచారం చేయడంతోపాటు ఎమ్మార్వో నివేదికకు విరుద్ధమైన ప్రకటనలు చేయడంతో యూనివర్సిటీ ఉద్యోగి ప్రవర్తనా నియమాలను ఉల్లంఘించారని నోటీసులో పేర్కొన్నారు. ఈ వ్యవహారాన్ని ఇన్‌చార్జి వీసీ వాకాటి కరుణ సీరియస్‌గా పరిశీలించి మూడు రోజుల్లో వివరణ ఇవ్వాలని, పైన పేర్కొన్న కారణాలతో అతనిపై క్రమశిక్షణా చర్య ఎందుకు తీసుకోకూడదో వివరణ ఇవ్వాలని పేర్కొన్నారు. త్వరలోనే అశోక్‌బాబును విధుల నుంచి తప్పించనున్నట్లు సమాచారం.

అటవీ అధికారులపై దాడితో అలజడి

- జేసీబీని స్వాధీనం చేసుకునేందుకు యత్నించగా దౌర్జన్యం
- వరంగల్‌లోని దవాఖానలో చికిత్స పొందుతున్న సిబ్బంది
- తీవ్రంగా ఖండించిన మంత్రులు సురేఖ, సీతక్క, కలెక్టర్
- నిందితులను అరెస్టు చేసినట్లు వెల్లడించిన ములుగు ఎస్పీ

గాయపడిన ఫారెస్ట్ అధికారిని పరామర్శిస్తున్న మంత్రి కొండా సురేఖ

గాయపడిన మరో అధికారి

ములుగు,సెప్టెంబర్27(నమస్తేతెలంగాణ)/తాడ్వాయి/వరంగల్: విధి నిర్వహణలో ఉన్న అటవీ శాఖాధికారులపై పోడు సాగుదారులు విరుచుకుపడి విచక్షణా రహితంగా దాడి చేసిన తీరు ములుగు జిల్లాలో తీవ్ర అలజడిని రేపింది. తాడ్వాయి రేంజ్ పరిధిలోని దామరవాయి గ్రామ శివారులో పోడు చేస్తున్నారనే సమాచారం మేరకు ఎఫ్ఎస్‌వో వినోద్‌కుమార్, ఎఫ్‌బీవోలు శరత్‌చంద్ర, సుమన్‌లు, బేస్‌క్యాపు సిబ్బంది ఎట్టి శ్రీను, జీపు డ్రైవర్ రాజేందర్ గురువారం రాత్రి పెట్రోలింగ్ వెళ్లారు. తాడ్వాయి వైపునకు వస్తున్న జేసీబీని నిలిపి స్వాధీనం చేసుకుని రేంజ్ కార్యాలయానికి తరలించేందుకు యత్నించారు. దీంతో ఆగ్రహం చెందిన జేసీబీ యజమాని గంట సూరజ్‌రెడ్డి, మరో నలుగురు కలిసి విచక్షణారహితంగా దాడి చేయడంతో ఎఫ్ఎస్‌వో వినోద్‌కుమార్, ఎఫ్‌బీలు శరత్‌చంద్ర, సుమన్‌లకు తల, చేతులకు తీవ్రగాయాలయ్యా యి. వారిని అటవీ శాఖాధికారులు వరంగల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. వారి పరిస్థితి నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. రెవెన్యూ భూమిలో పైప్‌లైన్ కందకాలు తీసేందుకు వెళ్లి తిరిగి వస్తుండగా అటవీ శాఖాధికారులు బూతులు తిడుతూ తన తమ్ముడు శశిధర్‌పై బండరాయితో తలపై కొట్టగా తీవ్ర రక్తస్రావం అవుతుండడంతో కోపంతో వారిపై దాడి చేశామని సూరజ్‌రెడ్డి తెలిపారు. అటవీ అధికారులపై దాడిని మంత్రులు కొండా సురేఖ, సీతక్క, కలెక్టర్ టీఎస్ దివాకరతోపాటు పలు ఆదివాసీ సంఘాల నాయకులు తీవ్రంగా ఖండించారు. డీఆర్వో కృష్ణవేణి ఫిర్యాదు మేరకు ఐదుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. ఫారెస్టు అధికారులపై దాడి చేసిన సూరజ్‌రెడ్డి, గంట శశిధర్, పాండవుల చింటు, పాండవుల సాయి, మ్యాదరి శ్రీకాంత్‌ను కాటాపూర్ క్రాస్ రోడ్డు వద్ద అరెస్టు చేశామని ఎస్సీ డాక్టర్ పి. శబరీష్ తెలిపారు. విచారణ అనంతరం కోర్టులో హాజరు పరుస్తామని వెల్లడించారు.

అటవీ ఉద్యోగులకు అండగా ఉంటాం

మంత్రులు కొండా సురేఖ, సీతక్క

అటవీ శాఖ ఉద్యోగులపై దాడులు చేస్తే ఉపేక్షించబోమని మంత్రి కొండా సురేఖ అన్నారు. వరంగల్‌లోని ప్రైవేట్ అసుపత్రిలో చికిత్స పొందుతున్న ఫారెస్ట్ సెక్షన్ అధికారి వినోద్‌కుమార్, బీట్ అధికారి శరత్‌చంద్రను మంత్రి సురేఖ పరామర్శించారు. బాధితుల కుటుంబ సభ్యులతో మాట్లాడి ఓదార్చారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. కోలుకునే వరకు నిరంతరం సమీక్షించాలని మంత్రి డీఎఫ్‌వో రాహుల్ కిషన్‌జాదవ్‌ను అదేశించారు. మంత్రి సీతక్క హైదరాబాద్ నుంచి ఫోన్‌లో మాట్లాడి అటవీశాఖాధికారులకు అండగా ఉంటామన్నారు.

రఘునాథపల్లిలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య

నీ ఎమ్మెల్యే పదవి మా కార్యకర్తలు పెట్టిన భిక్షే..

బీఆర్ఎస్‌కు డిపాజిట్ రాదనడం విడ్డూరం..

- ఉపఎన్నిక రావాలంటే రాజీనామా చేయాలి
- కడియం వ్యాఖ్యలపై మాజీ ఎమ్మెల్యే రాజయ్య

జనగామ, సెప్టెంబర్ 27(నమస్తే తెలంగాణ) : నీ ఎమ్మెల్యే పదవి మా బీఆర్ఎస్ కార్యకర్తలు పెట్టిన భిక్ష..అలాంటి పార్టీకి డిపాజిట్ రాదనడం విడ్డూరం అంటూ స్టేషన్‌ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య అన్నారు. కడియం శ్రీహరి వ్యాఖ్యలపై ఆయన జనగామ జిల్లా రఘునాథపల్లిలో శుక్రవారం ఘాటుగా స్పందించారు. కడియం శ్రీహరి కట్టపాము లాంటివాడని.. మొన్నటికి మొన్న డివిజన్ బెంచ్, కోర్టులకు వెళ్తా అని ఇప్పుడు ఉప ఎన్నికలు వస్తే ఎదుర్కొంటా నంటూ పూటకో మాట మాట్లాడుతున్నాడని మండిపడ్డాడు. కేసీఆర్ ఏ ఎమ్మెల్యే ఇంటికి వెళ్లి కండువా కప్పలేదని, రేవంత్‌రెడ్డి నీ ఇంటికి వచ్చి కండువా కప్పండని అన్నారు. స్పీకర్ పదవిలో ఉన్న వ్యక్తి రేవంత్‌రెడ్డి మాట లకు విలువ ఇస్తాడా ? రాజ్యాంగానికి విలువ ఇస్తాడా ? చూడాలన్నారు. కేసీఆర్‌ది అవినీతి పాలన అయితే 10 ఏండ్లు పక్కనే ఉన్న నీ వాటా ఎంత? అని ప్రశ్నించారు. ఎమ్మెల్యేగా గెలుపొంది 9 నెలలు గడిచినా నియోజకవర్గానికి ఒక్క రూపాయి తీసుకురాలేదన్నారు. ఎన్నికలు వస్తే అటు కాంగ్రెస్.. ఇటు బీఆర్ఎస్ శ్రేణులు కడియంను ఓడించడమే లక్ష్యం గా పెట్టుకున్నారని, ఉపఎన్నికలు రావంటూనే బీఆర్ఎస్‌కు డిపాజిట్ దక్కదంటూ మతిభ్రమించి మాట్లాడుతున్న కడియం తన పదవికి రాజీనామా చేయాలని రాజయ్య డి మాండ్ చేశారు. దేవాదులకు ద్రోహం చేసింది ముమ్మాటికి కడియం శ్రీహరే అన్నారు. ఘనపురం అభివృద్ధిపై చర్చకు సిద్ధమా? అని సవాల్ చేశారు. ఏడు రిజర్వాయర్లతో మూడు పంటలు పండించేంత అభివృద్ధి జరిగిందని, చెక్‌డ్యాంలు కట్టి, భూగర్భ జలాలు పెంచుకున్నామని, సోనియా, వైఎస్‌కు వ్యతిరేకంగా నీళ్లు విడుదల చేయొద్దని అభివృద్ధిని అడ్డుకున్న ద్రోహి శ్రీహరి అని ధ్వజమెత్తారు. 25వేల జనాభాతో ఏర్పడే ఘనపురం మున్సిపాలిటీని ఆనాడు అడ్డుకున్నది కూడా కడియం శ్రీహరేనని రాజయ్య పేర్కొన్నారు.

పట్టుబడిన గంజాయిని చూపుతున్న ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్

127 కిలోల గంజాయి పట్టివేత

- ఒకరి అరెస్ట్.. కారు స్వాధీనం
- నిందితుడు ఛత్తీస్‌గఢ్‌లో రెవెన్యూ ఉద్యోగి
- వివరాలు వెల్లడించిన మానుకోట ఎస్పీ కేకన్

చిన్నగూడూరు, సెప్టెంబర్ 27 : కారులో అక్రమంగా తరలిస్తున్న గంజాయిని పట్టుకొని ఒకరిని అరెస్ట్ చేసినట్లు మహబూబాబాద్ ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ తెలిపారు. మరిపెడ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. మరిపెడ శివారు గాలివారిగూడెం స్టేజీ వద్ద పోలీసులు వాహనాల తనిఖీలు చేపట్టారు. మరిపెడ నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న కారును పరిశీలించగా అందులో రూ.31.75 లక్షల విలువ చేసే 127 కిలోల ఎండు గంజాయి లభించింది. దీంతో గంజాయిని తరలిస్తున్న పోడి నాగేశ్వర్‌ను అదుపులోకి తీసుకొని కారును స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుకుమా జిల్లా, కుంటా మండలం అసీగూడెంకు చెందిన రెవెన్యూ ఉద్యోగిగా గుర్తించినట్లు ఎస్పీ వెల్లడించారు. పెద్ద మొత్తంలో గంజాయి పట్టుకున్న పోలీసు సిబ్బందికి రివార్డులు అందజేశారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ నిషేధిత వస్తువులు విక్రయించినా, రవాణా చేసిన కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో సీఐ రాజ్‌కుమార్ గౌడ్, ఎస్సైలు సతీశ్ గౌడ్, సంతోష్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



డ్యాన్స్ చేస్తున్న కేఎంసీ రిటైర్డ్ ప్రొఫెసర్ రమేశ్‌కుమార్

ఉల్లాసంగా.. ఉత్సాహంగా

- కేఎంసీలో అంబరాన్నంటిన సంబురాలు
- ముగిసిన ఉత్కర్ష-24 వేడుకలు

వరంగల్ చౌరస్తా, సెప్టెంబర్ 27 : కాకతీయ మెడికల్ కళాశాల (కేఎంసీ)లో కొనసాగుతున్న ఉత్కర్ష 24 వేడుకల్లో విద్యార్థుల సంబురాలు అంబరాన్నంటాయి. కేఎంసీలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ రాంకుమార్‌రెడ్డి, కళాశాల గత ప్రిన్సిపాల్స్ డాక్టర్ రమేశ్‌రావు, డాక్టర్ ఏఎన్ఆర్ లక్ష్మి, డాక్టర్ సంధ్యారాణి, కళాశాల 1967 బ్యాచ్ పూర్వ విద్యార్థి డాక్టర్ హనుమంతరావు హాజరయ్యారు. శుక్రవారం రాత్రి నిర్వహించిన ముగింపు వేడుకల్లో మాజీ ప్రిన్సిపాల్ డాక్టర్ రమేశ్‌రావు విద్యార్థులతో కలిసి డాన్స్ చేశారు. అనంతరం పోటీల్లో పాల్గొని విజేత